కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సు పోస్టులకు దరఖాస్తులు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్ ప్రాంతీయ సంచాలకులు వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయం- కడప- జోన్ 4 వారి పరిధిలోని 150 స్టాఫ్ నర్స్ ఉద్యోగాలను కాంట్రాక్ట్ ప్రాతిపదికన భర్తీ చేయుటకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు డిఎంఅండ్‌హెచ్‌ఒ ఒక ప్రకటనలో కోరారు. ఈ ఉద్యోగాలకు సంబంధించిన దరఖాస్తు నమూనా, ఇతర వివరాలు వైద్య ఆరోగ్యశాఖ వెబ్సైట్‌లో ఉంచామని, అభ్యర్థులు దరఖాస్తులను వెబ్సైట్ నుండి డౌన్లోడ్ చేసుకొని భర్తీ చేసిన దరఖాస్తులతో పాటు నిర్దేశించిన దరఖాస్తు రుసుమును, సర్టిఫికెట్లను ఈనెల 3 నుండి 17 వతేది సాయంత్రం ఐదు గంటల లోపల దరఖాస్తులను ప్రాంతీయ సంచాలకులు వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయం కడపలో అందజేయాలని కోరారు. నిర్దేశించిన గడువు తర్వాత వచ్చే దరఖాస్తులను పరిగణలోనికి తీసుకోబడవని తెలిపారు.

కిక్కు లో.. కిక్కు కొట్టొద్దు..!

- తాగి వాహనం నడిపితే రూ.10 వేలు జరిమానా కట్టాల్సిందే..
- వాహనం ఎక్కితే హెల్మెట్ పెట్టాల్సిందే.

ప్రజాశక్తి- పూతలపట్టు: గత ప్రభుత్వంలో కరోనా కారణంగా మద్యం తాగి వాహనాలు నడిపే వారిని పెద్దగా పట్టించుకోలేదు. బ్రీత్ ఎనలైజర్ పరికరం ఉండడం వల్ల కరోనా వ్యాప్తి చెందుతుందన్న కారణంతో అడపాదడపా జరిమానాలు విధించి వదిలేశారు. ఒకవేళ పట్టుకున్నా కొద్ది మొత్తం జరిమానాతో వదిలేసేవారు. కానీ ఇటీవల కాలంలో రోడ్డు ప్రమాదాలు అధికమవ్వడంతో మద్యం తాగి వాహనాలు నడపడమే ప్రధాన కారణంగా గుర్తించిన పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు. తాగి వాహనాల నడుపుతూ పట్టుబడుతున్న మందు బాబులకు జరిమానా ఎంతో కొంత వేసి వదిలేస్తుండంతో వీరిలో భయం లేకుండా పోతుంది.. తరచూ కొంతమంది పట్టుపడడం వీరిలో ఎలాంటి మార్పు రాకపోవడంతో జరిమానాన్ని పెంచారు. మద్యం తాగి పట్టుబడితే కోర్టులో హాజరు పరిచి రూ 10,000 జరిమానా విధిస్తున్నారు. పూతలపట్టు పరిధిలో ఒక డిసెంబర్ మాసంలో మాత్రమే 147 కేసులు నమోదు చేశారు.

ఆల్కహాల్ శాతాన్ని బట్టి

మద్యం తాగి వాహనాలు నడిపే సమయంలో బ్రీత్ ఎనలైజర్ పరికరంతో ముందుగా పరీక్షిస్తారు. దీంట్లో ఆల్కహాల్ తీసుకున్నట్లు తేలితే స్టాండర్డ్ టెస్ట్ చేస్తారు. 30శాతం కంటే ఎక్కువ ఆల్కహాల్ తీసుకున్నట్లు నమోదైతే కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరుస్తున్నారు. వీరికి మెజిస్ట్రేట్ జరిమానా విధిస్తున్నారు.

> మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటున్నారు. రోడ్డు ప్రమాదాలకు మద్యం మత్తులో వాహనాలు నడపడమే ప్రధాన కారణంగా గుర్తించి పోలీసులు దీన్ని నివారించే చర్యలు చేపట్టారు. బ్రీత్ ఎనలైజర్ పరికరం సహాయంతో నిత్యం సాయంత్ర వేళల్లో జాతీయ రహదారిలో అక్కడక్కడ మద్యం బాబులపై ప్రత్యేక దృష్టి పెడుతున్నారు. భారీ జరిమానాలతో కిక్కు వదిలిస్తున్నారు.

హెల్మెట్ పై ప్రత్యేక నిఘా..

ఇటీవల కాలంలో హెల్మెట్ లేని కారణంగా వాహనదారులు అత్యధికంగా ప్రమాదాల్లో ప్రాణాలను కోల్పోతున్నట్లు పోలీసు శాఖ అంచనా వేసింది. దీనికి తోడు న్యాయస్థానాలు సైతం హెల్మెట్ లేకుండా వాహనాల నడుపుతుంటే పోలీసులు ఏం చేస్తున్నారని చురకలు అంటించడంతో హెల్మెట్లపై పోలీసు శాఖ ప్రత్యేక నిఘా పెట్టింది. హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపితే జరిమానా విధిస్తోంది. హెల్మెట్ ధరించని కొంతమందికి అవగాహన కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నారు. హెల్మెట్ ధరించడం వలన ఉన్న ప్రయోజనాలను వివరిస్తున్నారు.

నిబంధనలు పాటించాల్సిందే..

ఎవరైనా చట్టానికి ఒక్కటే.. మద్యం తాగి వాహనాలు నడపడం చట్టరీత్యా నేరం. అదేవిధంగా ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్లు ధరించాల్సిందే. ఇందులో ఎలాంటి తారతమ్యాలు చూడటం లేదు. రాజకీయ నాయకుల జోక్యాన్ని పట్టించుకోవడం లేదు.

- కృష్ణమోహన్ పూతలపట్టు సీఐ.

కొత్త కార్డుల జారీకి ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్

- డీలర్ల మార్పు
- పౌరసరఫరాల ప్రక్షాళన జరిగేనా..?

చౌకదుకాణాల ప్రక్షాళన దిశగా కూటమి ప్రభుత్వం అడుగులేస్తోంది. రేషన్ కార్డులు లేని దారిద్రరేఖకు దిగువ ఉన్న వారికి గుర్తించి కొత్త రేషన్ కార్డుల జారీకి మార్గదర్శకాలను విడుదల చేసింది. జిల్లా కొత్త రేషన్‌కార్డులు అవసరమైన లబ్ధిదారులకు గుర్తింపు ప్రక్రియ మొదలెట్టారు. ప్రభుత్వం మారిన వెంటనే రేషన్ షాపు డీలర్లను పెద్దఎత్తున మార్చారు. గత ప్రభుత్వంతో డీలర్ షాపులను దక్కించుకున్న వారి స్థానంలో అధికార పార్టీకి చెందిన వారికి కేటాయించారు.

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: చౌక దుకాణాల ద్వారా సరఫరా చేస్తున్న నిత్యావసర సరుకుల విధానంలో పలు మార్పులు తీసుకురావాలని భావిస్తున్న కూటమి ప్రభుత్వం కొత్త డీలర్ల నియామకానికి శ్రీకారం చుట్టింది. గత ప్రభుత్వం సచివాలయ పరిధి పేరిట చేసిన మార్పులతో దుకాణాలు రేషన్‌కార్డుల సంఖ్యలో వ్యత్యాసాలు చోటు చేసుకున్నాయి. ఖాళీ అయిన దుకాణాల్లో తాత్కాలిక డీలర్లుగా డ్వాక్రా మహిళలకు అవకాశం కల్పించారు. కొందరు తక్కువ కార్డులకు, మరికొందరు ఎక్కువ కార్డులకు నిత్యావసర వస్తులు సరఫరా చేస్తున్నారు. దీని వల్ల ఎక్కువ కార్డు లబ్దిదార్లుకు నిత్యావసరాలు సరఫరా చేసేందుకు కొందరు డీలర్లు ఇబ్బంది పడుతున్నారు. ఈ పరిస్థితి చక్కదిద్దేందుకు దుకాణాల విభజన చేయనుంది.

చౌకుదుకాణం డీలర్లుకు రేషన్‌కార్డులు విభిజన చేసి కేటాయించేలా నోటిఫికేషన్ జారీ చేసింది. చౌకదుకాణానికి 800 తెల్లరేషన్ కార్డుదారులకు నిత్యావసరాలు పంపిణీ చేయనున్నారు. పట్టణాల్లో ఒక చౌక దుకాణానికి వెయ్యి కార్డులకు నిత్యావసరాలు పంపిణీ చేయనున్నారు. చిత్తూరు జిల్లాలో 2,901 చౌకదుకాణాల ద్వారా 11,48,646 తెల్లరేషన్ కార్డుదారులకు నిత్యావసరాలు పంపిణీ చేస్తోంది. బియ్యం కార్డులో ఉన్న ఒక వ్యక్తికి నెలకు 5 కేజీల చొప్పున బియ్యం, కందిపప్పు, పామాయిల్ ఒక కేజి పంపిణీ చేస్తోంది. అంత్యోదయ కార్డుదారులకు 35 కేజీల బియ్యం, చక్కెర కేజి రూ.13.50, తెల్లరేషన్ కార్డుదారుకులు అర కేజి చక్కెర రూ.17లు చొప్పున పంపిణీ చేస్తోంది. గత ప్రభుత్వం 2021 ఫిబ్రవరి నుండీ ఇంటికే రేషన్ పంపిణీ పేరిట జిల్లాలో 724 మొబైలు వాహనాలను ఏర్పాటు చేసింది. ఇలా ఏర్పాటు చేసిన మొబైల్ వాహనాలు వారి కేటాయించిన ప్రాంతాల్లో ఎక్కడో ఓ చోటు నిత్యవసర సరుకులతో లబ్దిదార్లును అక్కడికే వచ్చేలా సమాచారం అందించి సచివాలయ సిబ్బంది ద్వారా పంపిణీ చేయడం ప్రభుత్వ నిబంధనల మేరకు ఇంటింటికీ సరఫరా చేయాలని ఉన్నా సచివాలయ సిబ్బంది సమక్షంలోనే నిబంధనలను తుంగలో తొక్కి తెల్లరేషన్ కార్డుదారులకు ఇబ్బందులు కలిగిస్తున్నారు. మరి కొన్ని ప్రాంతాల్లో మొబైల్ వాహనాన్ని కదిలించకుండానే రేషన్‌షాపుల వద్దకే లబ్దిదార్లు వచ్చి నిత్యాసరాలు తీసుకొనేలా చేస్తూ ప్రభుత్వం నుంచి మొబైల్ వాహనం ద్వారా సరఫరా చేసినట్లు బిల్లులు డ్రా చేసుకుంటున్నారు. గంటల తరబడీ వీధి చివరన సరఫరా చేస్తున్న మొబైల్ వాహనాల వద్ద, రేషన్‌షాపుల వద్ద పడిగాపులు పడాల్సి వస్తోందని దీనిపై పౌరసంబంధాల శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని లబ్దిదారులు కోరుతున్నారు. అలాగే ఆన్‌లైన్ పేరిట ఎక్కడైన రేషన్ తీసుకొనే అవకాశమున్నా అనేక డీలర్‌షాపులు ఆ షాపు పరిధిలోని కార్డులకు మినహా మరోప్రాంతం లబ్దిదార్లకు బియ్యం ఇవ్వడం లేదంటున్నారు.

ఏది ఏమైన్నపట్టికీ కూటమిప్రభుత్వం నిత్యావసరాల సరఫరాలో ప్రక్షాళన తీసుకురావడం మంచిదే అయినప్పటికీ తెల్లరేషన్ కార్డుదారులకు ఇబ్బందులను తొలగించడంతో పాటు బియ్యం, కందిపప్పు, పామాయిల్, చక్కెర, గోధుమలు, జొన్నలు, రాగులు ఇలా నిత్యావసర వస్తులు సరఫరాను పెంచాలని లబ్దిదార్లు కొరుతున్నారు. అలాగే రేషన్‌షాపుల వద్ద ధర పట్టిక ఏర్పాటు చేయడంతో పాటు తూకాల్లో తేడాలు లేకుండా తూనికల కొలత అధికారులచే తనిఖీలు నిర్వహించాలని కోరుతున్నారు.

సప్తగిరి గ్రామీణ బ్యాంక్

నూతన ప్రధాన కార్యాలయం ప్రారంభం

సప్తగిరి గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: సప్తగిరి గ్రామీణ బ్యాంక్ నూతన ప్రధాన కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, సప్తగిరి గ్రామీణ బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శివ్ భజరంగ్ సింగ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సప్తగిరి గ్రామీణ బ్యాంక్ చైర్మర్ ఎఎస్‌ఎన్.ప్రసాద్ మాట్లాడుతూ చిత్తూరు జిల్లా అభివృద్ధికి తమ బ్యాంక్ ఎక్కువ కృషి చేసేలా పనిచేస్తామని తెలిపారు. సప్తగిరి గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయం సొంత భవనం దాదాపు 25 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో మూడు అంతస్తులతో నిర్మించారని, సప్తగిరి గ్రామీణ బ్యాంక్‌కు ఇదివరకు సొంత భవనం లేదని, సప్తగిరి గ్రామీణ బ్యాంకు అధికారులు, సిబ్బంది ఆకాంక్షల మేరకు కొత్తగా భవనం ఏర్పాటు చేసుకున్నామన్నారు. ఖాతాదారులకు మెరుగైన సేవలందించేందుకు కృషి చేస్తామని, జిల్లా అభివృద్ధిలో భాగంగా 100 బ్రాంచ్‌ల పైన పనిచేస్తున్నాయని తెలిపారు. ఇండియన్ బ్యాంక్ జనరల్ మేనేజర్ చంద్రశేఖరన్, జనరల్ మేనేజర్ ప్రభాకరన్, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ రామకృష్ణ, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గణిత న్యూ ఇయర్

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: వింత చదరాలతో నూతన సంవత్సరాన్ని గురువారం మండలంలోని మంగళపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న సిరి, కీర్తన, జననీ విద్యార్థులు ఏర్పాటు చేశారు. 3 బై 3,4 బై 4, 5 బై5 వింత చదరాలతో ఎటు కూడిన 2025 వచ్చే విధంగా పూరించారు. 4 బై 4 వింత చదరంలో 24 రకాలుగా ఎటుకూడిన 2025 వచ్చే విధంగా పూరించారు. వీరు గణిత అవధాని అరుణ శివప్రసాద్ దగ్గర శిక్షణ పొందారు. ఈ ముగ్గురిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజ్యలక్ష్మి, గణిత ఉపాధ్యాయులు సంజీవి, రమాదేవి, పిల్లారప్ప, సంపంగి, ధన శేఖర్, భారతి, మోహన్ రెడ్డి, శ్రీనివాసులు అభినందించారు

4న జూనియర్ టెన్నికాయిట్ పోటీలకు ఎంపికలు

ప్రజాశక్తి- సోమల: సోమల మండలం మేజర్ పంచాయతీ కేంద్రమైన కందూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈనెల 4వ తేదీ శనివారం మధ్యాహ్నం రెండు గంటల నుండి ఉమ్మడి చిత్తూరు జిల్లా నుండి జూనియర్ టెన్నికాయిట్ పోటీల క్రీడాకారుల ఎంపిక నిర్వహిస్తున్నట్లు జిల్లా టెన్నికాయిట్ కార్యదర్శి చిన్నప్ప తెలిపారు. 1.4.2006 సంవత్సరం తర్వాత జన్మించిన వారు అర్హులని ఎంపిక కోసం వచ్చేవారు పాఠశాల ప్రధానోపాధ్యాయుల వద్ద నుండి జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు వెంట తీసుకురావాలని, ఎంపిక కాబడ్డ బాలబాలికలు ఈనెల 11, 12వ తేదీలలో శ్రీకాకుళం జిల్లా పలాసలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో ఆడే అవకాశం ఉంటుందని తెలిపారు.

పరుగో.. పరుగు..

మూడో రోజూ కొనసాగుతున్న కానిస్టేబుల్ ఎంపిక ప్రక్రియ

కానిస్టేబుల్ ఎంపికలో పరుగులు పెడుతున్న అభ్యర్థులు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: కానిస్టేబుళ్ళ ఎంపిక ప్రక్రియ ఎస్పీ మణికంఠ చందోలు పర్యవేక్షణలో గురువారం మూడు రోజు నిర్వహించారు. 599 మంది అభ్యర్థులకు గాను 394 మంది హాజరు కాగా వీరిలో 163 మంది అర్హత సాధించారు. శుక్రవారం ప్రత్యేకంగా మహిళా అభ్యర్థులకే దేహదారుఢ్యం, సామర్థ్య పరీక్షలు నిర్వహించనున్నారు. 495మంది హాజరు కానున్నారు. వీరి పరీక్షల నిర్వహణ కొరకు అదనంగా ఒక మహిళా డీఎస్పీ, ఒక మహిళా ఇన్స్పెక్టర్, 5 మంది మహిళా ఎస్‌ఐలు, 35 మంది మహిళా కానిస్టేబుళ్ళు, 8 మంది మహిళా హోం గార్డ్‌లను నియమించారు. అదేవిధంగా మహిళా అభ్యర్థులకు ఎవరికైనా ఆరోగ్య సమస్యలు వుంటే తప్పకుండా తెలపాలని ఎస్పీ సూచించారు. ఫిజికల్ మెజర్మెంట్ పరీక్షలు, ఆర్.ఎఫ్.ఐ.డి ట్యాగుల పంపిణీ, ఫిజికల్ ఎఫిషియన్సీ పరీక్షలు (1600 మీటర్లు, 100 మీటర్ల పరుగు, లాంగ్ జంప్) రిజల్ట్ కౌంటర్ వరకు కేటాయించిన విధులను సిబ్బంది పకడ్బందీగా నిర్వహించారు. ఇక పరుగు పందెంలో అలసిన అభ్యర్థులకు వైద్యులు ప్రథమ చికిత్స అందించారు. ఈ మూడు రోజులు జరిగిన కానిస్టేబుళ్ళ ఎంపిక ప్రక్రియలో 1799 అభ్యర్థులకు గాను 1173 మంది హాజరై 477 మంది రాత పరీక్షకు అర్హత సాధించారు. భర్తీ ప్రక్రియ పారదర్శకంగా పూర్తిగా అభ్యర్థుల ప్రతిభ పాటవల ఆధారంగానే జరుగుతుందని అభ్యర్థులు, వారి తల్లితండ్రులు దళారులను, మధ్యవర్తులను నమ్మి మోసపోకుండా ఉండాలన్నారు. ఎవరైనా తాము భర్తీకి సహకరిస్తామని మోసం చేయాలని ప్రయత్నిస్తే డయల్ 112కు లేదా మొబైల్ నెంబర్‌కు 94409 00005కు గాని ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని కోరారు.

పిహెచ్‌సిల్లో ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్, రామకుప్పం: జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ సుధారాణి గురువారం జిల్లాలోని రామకుప్పం, విజిలాపురం, కంగుంది పిహెచ్‌సిలను ఆకస్మిక తనిఖీ చేశారు. అలాగే కుప్పం నియోజకవర్గంలో ఈనెల ఐదు నుంచి ఏడు వరకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటన సందర్భంగా పిహెచ్‌సి డాక్టర్లతో పలు విషయాలపై సమీక్షించారు. పిహెచ్‌సిల్లో అవసరమైన పరికరాలు, ఉపయోగించే తీరు, ఉండాల్సిన సిబ్బంది, డెలివరీల ప్రాముఖ్యతపై, రక్త పరీక్షలపై, మందుల నిల్వపై, వ్యాక్సిన్‌ల మెయింటెనెన్స్‌పై, అన్ని రకాల జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై రికార్డులను పరిశీలించి తగు సూచనలు చేశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పేషంట్ల పట్ల సిబ్బంది సానుకూల దృక్పథంతో వ్యవహరించాలని తెలిపారు. ఉప వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటప్రసాద్, డిబిసిఎస్ డాక్టర్ అర్పిత, మలేరియా అధికారి డాక్టర్ అనిల్ కుమార్, ఏపిడి మీయాలజిస్ట్ శ్రీవాణి, డెమో జయరాముడు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలను తనిఖీ చేస్తున్న డిఎంఅండ్‌హెచ్‌ఒ డాక్టర్ సుధారాణి

ప్రభుత్వ పాఠశాలల నిర్వహణపై శిక్షణ

కుప్పంలో..

ప్రజాశక్తి- కుప్పం టౌన్: ప్రభుత్వ పాఠశాలల నిర్వహణపై శిక్షణా కార్యక్రమాన్ని కుప్పం పట్టణంలోని ప్రభుత్వ బాలుర పాఠశాలలో నిర్వహించారు. మండల విద్యాశాఖ అధికారి జయరామ్ మాట్లాడుతూ పాఠశాలల నిర్వహణపై ఎస్ఎంసి, ఉపాధ్యాయుల బాధ్యతలను వివరించారు. ప్రతి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని సూచిస్తూ, వాటి నిర్వహణ, పర్యవేక్షణకు పేరెంట్స్ కమిటీ తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

పలమనేరు: పట్టణంలోని గవర్నమెంట్ ఉన్నత పాఠశాలలో పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులకు గురువారం ఒక్కరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. మండల విద్యాశాఖ అధికారులు పీ.లీలరాణి, సి.బాలసుందరం, జిల్లా సైన్స్ అధికారి బాలచైతన్య ఆర్‌పిలు రవీంద్రబాబు, మణి, గురుమూర్తి పాఠశాల యాజమాన్య కమిటీ ఏర్పాటు విధులు, బాధ్యతలు, బాలల హక్కుల పరిరక్షణ, పాఠశాల అభివృద్ధి ప్రణాళిక పాఠశాల సామాజిక తనిఖీ, పాఠశాల అభివృద్ధిపై శిక్షణ ఇవ్వడం జరిగింది.

తవణంపల్లి: మండలంలోని 66 ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఎస్ఎంసి చైర్మన్‌లకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల విద్యాశాఖ అధికారులు నిహేమలత, త్యాగరాజ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం ఒక రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. రిసోర్స్ పర్సన్ మునస్వామి, చిరంజీవి, బాలచంద్రారెడ్డి, పెద్దబ్బ రెడ్డి, చిరంజీవి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దేవరాజు రెడ్డి పాల్గొన్నారు.

రొంపిచర్ల: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం నూతనంగా ఎన్నికైన విద్యా కమిటీ చైర్మన్‌లు, వైస్ చైర్మన్లు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమంను సర్పంచ్ ఆర్ ఇబ్రహీం ఖాన్ ప్రారంభించారు. ఎంఈఓలు శ్రీనివాసులు, ఇందిర, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యా కమిటీ చైర్మన్లు, సిఆర్‌పి కిరణ్ పాల్గొన్నారు.

సోమల: ప్రభుత్వ పాఠశాలలో అభివృద్ధి చేపట్టేందుకు మౌలిక వసతుల కల్పనకు బడి మానివేసిన పిల్లలను తిరిగి బడిలో చేర్పించేందుకు తదితర అంశాలపై పాఠశాలల యాజమాన్య కమిటీలు దృష్టి సారించాలని సోమల మండల అభివృద్ధి అధికారి కేశవరెడ్డి అన్నారు.

పలమనేరులో..

గురువారం మండలంలోని ప్రభుత్వ పాఠశాలల యాజమాన్య కమిటీ చైర్మన్ (ఎస్ఎంసి చైర్మన్)లకు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఒక్కరోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. మధ్యాహ్న భోజనం, విద్యార్థుల హాజరు, పాఠశాలల్లో వసతుల కల్పన, తదితర అంశాలపై వారికి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. 3 నుంచి 6వ తేదీ లోపు మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లోని ఆయా పాఠశాలల అభివృద్ధి కమిటీ సభ్యులకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించినట్లు ఎంఈఓ శివరత్నమ్మ తెలిపారు.

రామకుప్పంలో..

బంగారుపాల్యం: పాఠశాల అభివృద్ధికి ఉమ్మడిగా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని మండల విద్యాశాఖ అధికారి నాగేశ్వరరావు తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు ఎస్ఎంసి సభ్యులకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం జరిగింది. మండల విద్యాశాఖ అధికారి 2 రమేష్ బాబు, రీసెర్చ్ పర్సన్స్ లక్ష్మీపతి, మురళీకృష్ణ, షబానా భాను, సీఆర్పీలు సుశీల, ప్రేమలత, కృష్ణమూర్తి, సతీష్, ప్రధానోపాధ్యాయులు, సభ్యులు పాల్గొన్నారు.

ఎస్ఆర్ పురం: మండల కేంద్రంలోని మండల విద్యావనరుల కేంద్రంలో మండలస్థాయిలో పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులకు, ప్రధానోపాధ్యాయులకు గురువారం ఒక రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించినట్లు మండల విద్యాధికారులు అరుణాచల రెడ్డి, సబర్మతి తెలిపారు. వారు మాట్లాడుతూ పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యుల విధులు, బాధ్యతల గురించి వివరించారు. రిసోర్స్ పర్సన్స్ రాజేంద్ర, దీనావతి, గుర్రప్ప, శివాజి , సీఆర్పీలు పాల్గొన్నారు.

రామకుప్పం: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి స్కూల్ కమిటీ చైర్మన్లు, ఉపాధ్యాయులు కృషి చేయాలని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ సురేష్ బాబు, మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి పేర్కొన్నారు. గురువారం పాఠశాల విద్యాకమిటీ చైర్మన్లు, ప్రధానోపాధ్యాయులకు రామకుప్పంలో పాఠశాల అభివృద్ధిపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం మంచి రుచిగా ఉండేలా చైర్మన్లు, ప్రధానోపాధ్యాయుల సమన్వయంతో చొరవ తీసుకోవాలన్నారు. బడి ఈడు పిల్లలను తప్పకుండా పాఠశాలలో చేర్పించాలన్నారు. సర్వేపల్లి రాధాకృష్ణ విద్యాకానుక కిట్లను నాణ్యతతో అందించడం జరుగుతుందన్నారు. ఎంఈఓ 2 నారాయణ, నరసింహులు, సీతాపతి, కన్నన్, సుబ్రీ, బాలరాజు, గజేంద్ర, కేశవరెడ్డి, జనసేన భాస్కర్, బిజెపి వెంకటేష్ పాల్గొన్నారు.

ఎస్ఆర్ పురంలో..

కడప దర్గాను దర్శించుకున్న ఎమ్మెల్యే

కడప పెద్దదర్గాలో కుటుంబంతో ఎమ్మెల్యే గురజాల

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: కడపలోని ప్రఖ్యాత పెద్ద దర్గాను చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ దర్శించుకున్నారు. గురువారం ఉదయం ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు, టిడిపి నాయకులతో కలిసి కడప పెద్ద దర్గాను దర్శించుకున్నారు. ఎమ్మెల్యే కుటుంబ సభ్యులతో కలిసి చాదర్‌ను సమర్పించారు. ఈ సందర్భంగా మత పెద్దలు ఎమ్మెల్యే వారి కుటుంబ సభ్యుల చేత ప్రత్యేక ప్రార్థనలు చేయించారు. మాజీ జెడ్పీ చైర్మన్ దంపతులు గిర్వాణీ, చంద్రప్రకాష్, మాజీ ఎమ్మెల్సీ బీఎన్ రాజసింహులు, చుడా చైర్ పర్సన్ కఠారి హేమలత, నాయకులు పాల్గొన్నారు.

పంచాయతీ అభివృద్ధిపై దృష్టి పెట్టాలి

కందూరు సర్పంచ్ బాష మసూద్

మాట్లాడుతున్న సర్పంచ్ బాష మసూద్

ప్రజాశక్తి- సోమల: పంచాయతీ పరిధిలోని గ్రామాలలో ప్రజల సౌకర్యార్థం తాగునీరు, వీధి దీపాల ఏర్పాటు, మురుగునీటి కాలువల పరిశుభ్రం తదితర అంశాలపై సచివాలయ సిబ్బంది దృష్టి సారించాలని కందూరు సర్పంచ్ బాష మసూద్ కోరారు. గురువారం పంచాయతీ కార్యాలయంలో ప్రతి ఏడు జనవరి 2వ తేదీ నిర్వహించే గ్రామ సభను సచివాలయ సిబ్బంది, రెవెన్యూ, విద్య వైద్య తదితర శాఖల సిబ్బందితో నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి జయశంకర్ మాట్లాడుతూ ప్రజలకు సౌకర్యాల కల్పనలో రాజీ లేకుండా సిబ్బంది కృషి చేయాలన్నారు. ముఖ్యంగా పారిశుద్ధ్యం, తాగునీరు, వీధి దీపాల ఏర్పాటు అంశాలపై ఎప్పుడు నిర్లక్ష్యం వహించకుండా ప్రజలకు అందే విధంగా చూడాలన్నారు. వైద్య సిబ్బంది కూడా ఇందుకు సహకారం అందించి గ్రామాలలో రోగాలు ప్రబలకుండా వైద్యసలహాలు సూచనలు అందజేయాలని కోరారు. కార్యక్రమంలో వీఆర్వో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు సర్వీస్ ప్రారంభం

ప్రజాశక్తి - రామకుప్పం: మండలంలోని కోట్లగురు గ్రామంలో ఏపీఎస్ ఆర్టీసీ బస్సు సర్వీసును టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ సురేష్ బాబు, మండల అధ్యక్షులు ఆనంద రెడ్డి గురువారం ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ పియస్ మునిరత్నం సహకారంతో కుప్పం నియోజకవర్గంలో అన్ని గ్రామీణ ప్రాంతాలకు బస్సు సౌకర్యం కల్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వంలో రాష్ట్ర రవాణా సంస్థ ప్రజలకు మరింత సేవలు అందించేందుకు ఏపీఎస్ ఆర్టీసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు పిఎస్ మునిరత్నం అహర్నిశల కృషి చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వంలో ఆర్టీసీ బస్సులు లేక దివాలా తీసిందన్నారు. రానున్న రోజుల్లో మండల వ్యాప్తంగా మరిన్ని గ్రామీణ సర్వీసులతో పాటు మండల కేంద్రం నుంచి ఇతర రాష్ట్రాలకు ప్రత్యేక బస్సులు నడపడానికి చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. మాజీ సర్పంచ్ సీతాపతి, మాజీ ఉపసర్పంచ్ గంట్లరెడ్డి, కన్నన్, పార్టీ ప్రధాన కార్యదర్శి నరసింహులు, వెంకటరమణ, గజేంద్ర, కోదండరామిరెడ్డి, విజయ్ రెడ్డి, అల్లి శీను, సుబ్రి, బాలు, నీయూ సాబ్ పాల్గొన్నారు.

నకిలీ పాసు పుస్తకాలపై విచారించండి

జిల్లా అధికారికి ఓ రైతు మొర

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం: చిత్తూరు జిల్లా వ్యవసాయ పరపతి సంఘంలో నకిలీ పాసుపుస్తకం కలకలం రేపుతోంది. ఇందుకు సంబంధించి వెదురుకుప్పం మండలం చెందిన ఓ రైతు జిల్లా వ్యవసాయ పరపతి సంఘం సీఈవోకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆ రైతు గురువారం మీడియా ముందుకు వచ్చాడు. సంబంధిత రైతు పేరుపై ఉన్న పొలానికి నకిలీ పాసు బుక్ సృష్టించి కార్వేటినగరం సంబంధించిన బ్యాంకులో లక్షల్లో లోను తీసుకున్నట్లు బాధితుడు ఆరోపించాడు. ఇందుకు సంబంధించిన జిల్లా వ్యవసాయ పరపతి సంఘం అధికారికి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. స్పందించిన ఆయన వచ్చేవారం సంబంధించిన బ్యాంకుల్లో తనిఖీలు చేస్తున్నట్లు రైతుకు భరోసా ఇచ్చినట్లు తెలిపారు. సంబంధించిన అధికారుల విచారణలో నిజానిజాలు తెలియనున్నాయి.

సైనిక సంక్షేమానికి రూ. 10,116లు

ప్రజాశక్తి -చిత్తూరుఅర్బన్: సైనిక సంక్షేమ నిధికి 10.116 రూపాయలను రిటైర్డ్ రెవెన్యూ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షులు భవాని రెడ్డప్ప, కార్యదర్శి రఘుపతి, ఉపాధ్యక్షులు ప్రభాకర్ నాయుడు గురువారం జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ చేతుల మీదుగా జిల్లా సైనిక సంక్షేమాధికారి కెవి. రాఘవులుకు అందజేశారు. సైనిక సంక్షేమ నిధికి విరాళం అందించిన మాజీ రెవెన్యూ ఉద్యోగుల సంఘం నాయకులను కలెక్టర్ అభినందించారు. ప్రతిఒక్కరూ సైనిక సంక్షేమం కోసం విరాళాలు అందించాలని కోరారు.

కలెక్టర్ చేతుల మీదుగా చెక్కును అందుకుంటున్న రాఘవులు

పల్లెల్లో గ్రామసభలు

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం: భూ సమస్యలను పరిష్కరించడం కోసం ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను ఏర్పాటు చేసిందని భూములకు సంబంధించి సమస్యలను అధికారులు దృష్టికి తీసుకురావాలని తహశీల్దార్ లోకనాథ పిళ్ళై తెలిపారు. గురువారం తహశీల్దార్ ఆధ్వర్యంలో కటికపల్లి గ్రామంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించగా ప్రజలకు పలు సమస్యలపై అర్జీలు అందజేసినట్లు తెలిపారు. డిటి రవికుమార్, సర్వేర్ వీఆర్వో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లి: మండలంలోని వెంగంవారిపల్లి పంచాయతీలో గ్రామ సర్పంచ్ రవిచంద్రబాబు ఆధ్వర్యంలో గురువారం గ్రామసభ నిర్వహించారు. ఈ గ్రామసభకు వైద్యాధికారులు, మండల హెల్త్ ఎడ్యుకేటర్ సావిత్రి హాజరయ్యారు. గతంలో జ్వరాల వలన విద్యార్థి చనిపోవడంతో దాని దృష్టిలో ఉంచుకొని గ్రామస్తులకు జ్వరములు నివారణ, ఫ్రైడే డ్రైడే, పరిసరాల పరిశుభ్రత ప్రాముఖ్యత, శానిటేషన్ గురించి వివరించారు. గ్రామంలో తాగునీటి ట్యాంక్ ద్వారా వచ్చే నీరు శుభ్రపరిచే విధంగా చర్యలు చేపట్టి మినరల్ వాటర్ అందించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని గ్రామ ప్రజలు కోరారు. సర్పంచ్ రవిచంద్రబాబు మాట్లాడుతూ ఈ విషయాన్ని ఉన్నత అధికారులకు తెలియపరచి వాటర్ ప్లాంట్ గ్రామంలో కూడా పెట్టించే ఏర్పాటు చేస్తానని తెలిపారు.

రొంపిచర్ల: మండల పరిషత్ కార్యాలయంలో గురువారం సర్పంచ్ ఆర్ ఇబ్రహీం ఖాన్ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. గ్రామ సభలో ప్రజలు పక్కా ఇండ్లు, సామాజిక పెన్షన్లు, తదితర సమస్యలపై అర్జీలు అందజేశారు. సమస్యలన్నింటినీ పరిష్కరించే దిశగా ఉద్యోగులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎంపీడీవో మధుసూదన్ రెడ్డి, పంచాయతీ ఈవో సత్యంరెడ్డి పాల్గొన్నారు.

రైతుల అసంతృప్తి

పలమనేరు: పలమనేరులో గురువారం ఉదయం 10 గంటలకు వ్యవసాయ కార్యాలయం వద్ద మండల తహశీలాకదనఖ ఇబ్బునాథన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో తమ సమస్యలు పరిష్కారం కాలేదంటూ రైతులు తీవ్ర అసంతృప్తిని తెలియజేశారు. సమస్యల పరిష్కారం కోం సచివాలయాలు, తహశీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న తమ సమస్యలు పరిష్కారం కావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తహశీల్దార్ మాట్లాడుతూ రెవెన్యూ పరిధిలో పరిష్కారం కాకుండా ఉన్న రెవెన్యూ సమస్యలను వెంటనే పరిష్కారించేలా చర్యలు చేపడతామని తెలిపారు. టిడిపి నాయకులు ఆర్‌వి.బాలాజీ, ఆర్బీసీ కుట్టి, సుబ్రహ్మణ్యం గౌడ, కృష్ణమూర్తి, ఎస్సీ సెల్ నాయకులు గిరి, నాగరాజు పాల్గొన్నారు.



తిరువన్నామలై కి ప్రత్యేక బస్సు సర్వీసు

ప్రజాశక్తి- కుప్పంటౌన్: తమిళనాడు రాష్ట్రంలోని తిరువన్నామలై గిరి ప్రదక్షణకు పౌర్ణమి సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో చేరుకుంటారు. ఈ సందర్భంగా కుప్పం పరిసర ప్రాంతాల నుండి తిరువన్నామలై వెళ్ళు భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ ప్రత్యేక సర్వీసును నడుపుతున్నట్టు అధికారులు తెలిపారు. ఈనెల 13వ తేదీ పౌర్ణమి సందర్భంగా ఒక్కరోజు ఆర్టీసీ అధికారులు ప్రత్యేకంగా నడుపుతున్న బస్సు సర్వీసును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 13వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు కుప్పం నుండి బస్సు ప్రారంభం కానున్నదని, తిరువన్నామలై చేరుకున్న బస్సు భక్తుల గిరి ప్రదక్షణ అనంతరం మరుసటి రోజు ఉదయం 7 గంటలకు కుప్పం చేరుకున్నట్టు తెలిపారు. ప్రయాణికులకు రాను పోను బస్సు చార్జీలు 380గా నిర్ణయించినట్టు తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలనుకున్నవారు బస్టాండ్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన టికెట్ బుకింగ్ కౌంటర్ నందు కానీ, ఆన్లైన్ ద్వారా కానీ ముందుగా టికెట్ బుక్ చేసుకొనే అవకాశం ఉందన్నారు.

ఐఏఎస్‌ను సన్మానించిన ఎంపీడీఓ

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: మండలంలోని ఎంపిడిఓ కార్యాలయంలో గురువారం ప్రొబేషనరీ ఐఏఎస్ డి.హిమవంశీని సిబ్బందితో కలిసి ఎంపీడీవో హరిప్రసాద్ రెడ్డి శాలువతో సన్మానించారు. పూలబొకే అనంతరం మండల పరిషత్తు అధికారులను, సిబ్బందిని పరిచయం చేసికొని, నిర్వహిస్తున్న సబ్జెక్టులు, అమలవుతున్న వివిధ సంక్షేమ, అభివృద్ధి పథకాల గురించి చర్చించారు.

టిడిపి కార్యకర్త మృతికి నివాళి

ప్రజాశక్తి- రొంపిచర్ల: పులిచెర్ల మండలం దేవళంపేట పంచాయతీ చిన్న బెస్తపల్లికు చెందిన తెలుగుదేశం పార్టీ యువకార్యకర్త గూడూరు గురు ప్రసాద్ (20) గురువారం ఉదయం 8 గంటలకి విద్యుత్ షాక్ వల్ల ప్రమాదవశాత్తు మరణించారు. కార్యకర్త మరణించారన్న వార్త తెలియగానే పుంగనూరు తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి చల్లా రామచంద్రారెడ్డి అక్కడకు చేరుకుని మృతదేహానికి తెలుగుదేశం పార్టీ జెండా కప్పి, వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేశారు. తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు ఎల్లప్పుడూ తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

మృతుని కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి- గంగాధర నెల్లూరు: వైసిపి నాయకులు వరదరాజుల రెడ్డి (పెద్దారెడ్డి) కుటుంబాన్ని నియోజకవర్గ ఇన్చార్జ్ కృపా లక్ష్మి గురువారం పరామర్శించారు. మండలంలోని వేపంజేరి పంచాయతీ మాజీ సర్పంచ్ వరదరాజులు రెడ్డి (పెద్దారెడ్డి) తండ్రి చిన్నబ్బరెడ్డి (110) వృద్ధాప్య కారణంగా బుధవారం మృతి చెందారు. సమాచారం తెలుసుకన్న నియోజకవర్గ ఇన్చార్జి కృపాలక్ష్మి ఆ కుటుంబాన్ని ఓదార్చారు. అదేవిధంగా కోటాగరం పంచాయతీ మాజీ సర్పంచ్ జనార్ధన్ రెడ్డి ఇటీవల గుండెకు సంబంధించి వైద్యచికిత్సలు చేసుకోగా అతన్ని కలిసి పరామర్శించారు. మాజీ సింగల్ విండో అధ్యక్షులు వేల్కూరు బాబురెడ్డి, వైస్ ఎంపీపీ హరిబాబు, అంబోదరపల్లి బాబురెడ్డి, రూప శేఖర్‌రెడ్డి, బూత్ కన్వీనర్ వెంకటేష్ రెడ్డి, కిషోర్ రెడ్డి, ఢిల్లీ, జగదీష్, మణి, గోపి, విష్ణు, కుట్టి పాల్గొన్నారు.

'తల్లికి వందనం' వెంటనే వేయాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - క్యాంపస్: తల్లికి వందనం పథకం వచ్చే విద్యా సంవత్సరం నుండి అమలు చేస్తామని చేసిన నిర్ణయాన్ని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అక్బర్, భగత్ రవి ఓ ప్రకటనలో ఖండించారు. ప్రభుత్వ నిర్ణయం విద్యార్థుల తల్లిదండ్రుల్లో నిరాశ మిగిల్చిందన్నారు. ఇంట్లో ఎంత మంది విద్యార్థులు ఉంటే అంత మందికి తల్లికి వందనం కింద ప్రతి యేట రూ.15వేలు చొప్పున ఇస్తామని చెప్పిన కూటమి నేతలు ఈ విద్యా సంవత్సరం ఇవ్వలేమని చేతులెత్తయడం దుర్మార్గం అన్నారు. ప్రభుత్వ నిర్ణయంతో దాదాపు 45 లక్షల మంది తల్లులు 83 లక్షల మంది విద్యార్థులు నష్టపోతారని, వారి కుటుంబాలపై ఆర్థిక భారం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే ఏమవుతుందో గత ఎన్నికలలో ప్రజలు ఇచ్చిన తీర్పు మరవద్దని హితవుపలికారు.

సచివాలయంలో ఎంపిడిఓ తనిఖీలు

ప్రజాశక్తి- ఐరాల: గ్రామ సచివాలయాలు సిబ్బంది పనితీరును ఎంపీడీవో ధనలక్ష్మి పరిశీలించారు. గురువారం పుత్రమద్ది, మిట్టూరు, ముదిగోళం గ్రామ సచివాలయాల్లో తనిఖీలు నిర్వహించి సిబ్బంది పనితీరును పరిశీలించినారు. ఎంపిడిఓ మాట్లాడుతూ సిబ్బంది కార్యాలయం పనివేళలో ప్రజలకు అందుబాటులో ఉండాలని, ప్రజలతో మర్యాదగా మెలాగాలని సూచించినారు. గ్రామ పంచాయతీ పరిధిలోని చెత్త సంపద కేంద్రాలను సందర్శించి వెంటనే వాటిని వినియోగంలోకి తీసుకునిరావాలని, ఇంటింటి నుంచి చెత్త సేకరణ చేయాలని గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. వర్షాలకు దోమలు ప్రబలకుండా ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని, ప్రజలను చైతన్య పరచాలని సూచించినారు.

సచివాలయ సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఎంపీడీవో ధనలక్ష్మి

యుటిఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం అధ్యక్షులు మహేష్ బాబు ఆధ్వర్యంలో యుటిఎఫ్ క్యాలెండరు డైరీ మండల విద్యాశాఖ అధికారులు నాగేశ్వరరావు రమేష్ బాబు ఆవిష్కరించారు. జిల్లా కార్యదర్శి సరిత, మండల గౌరవాధ్యక్షులు రామ్మూర్తి, ప్రధాన కార్యదర్శి మోహన్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు,

తవణపల్లి: పూతలపట్టు ఎమ్మెల్యే కలికిరి మురళీ మోహన్ యుటిఎఫ్ క్యాలెండర్‌ను చిత్తూరులోని ఆయన కార్యాలయంలో ఆవిష్కరించారు. యుటిఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు పి.సుధాకర్‌రెడ్డి, మండల అధ్యక్షులు ఎస్సీ రాజేష్ కుమార్, జనరల్ సెక్రటరీ టి.పెద్దబ్బరెడ్డి, ఐఎస్ చిరంజీవి పాల్గొన్నారు.



సిఎం పర్యటన ఏర్పాట్లలో అధికారులు

ప్రకృతి వ్యవసాయ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ప్రజాశక్తి- కుప్పం టౌన్: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కుప్పం పర్యటనను విజయవంతం చేయడానికి ప్రభుత్వ అధికారులు ముందస్తు ఏర్పాట్లను పకడ్బందీగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా కుప్పం డీఎస్పీ పార్థసారథి, పోలీసు వలయాధికారి మల్లేష్ యాదవ్, పురపాలక సంఘం కమిషనర్ శ్రీనివాసరావు ముఖ్యమంత్రి పర్యటన స్థలాలను పరిశీలించారు. బాబు పర్యటనలో భాగంగా పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించనున్నట్లు తెలుస్తోంది. పట్టణ పరిధిలోని శీగలపల్లి ప్రాంతంలోని ప్రకృతి వ్యవసాయ కేంద్రాన్ని ముఖ్యమంత్రి సందర్శించనున్నట్లు సమాచారం. ఈ సమాచారాన్ని బలపరుస్తూ అధికారులు గురువారం ప్రకృతి వ్యవసాయ కేంద్రాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో పురపాలక సంఘం ఫ్లోర్ లీడర్ జిమ్ దాము, స్థానిక నాయకులు రోహిత్, నవీన్, ప్రశాంత్ పాల్గొన్నారు.

గుడిపల్లి: కుప్పం నియోజకవర్గంలో మూడు రోజుల పర్యటనలో భాగంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 5వ తేదీ గుడిపల్లి మండలం ద్రావిడ విశ్వవిద్యాలయ ప్రాంగణంలో హెలికాప్టర్ ద్వారా చేరుకుంటారు. ఇందులో భాగంగా మండల పార్టీ అధ్యక్షుడు టిఎం. బాబు నాయుడు. ఆర్ అండ్ బి అధికారులు హెలీప్యాడ్ నిర్మాణాన్ని పూర్తి చేయడంతో గురువారం పరిశీలించారు. సర్పంచ్ గోపాల్, నియోజకవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షుడు సుబ్రమణి, ప్రకాష్ పాల్గొన్నారు.

హెలీప్యాడ్‌పనులను పరిశీలిస్తున్న నాయకులు, అధికారులు

ప్రజాశక్తి - పిచ్చాటూరు: అందుబాటులో కళాశాలలు లేకపోవడంతో విద్యార్థులు అటు సత్యవేడుకో, ఇటు పుత్తూరుకో ప్రయాణించక తప్పడం లేదు. అయితే విద్యార్థుల సంఖ్యకు సరిపడా బస్సులు లేకపోవడంతో ఫుట్‌పాత్‌లపైనే విద్యార్థులు ఉండాల్సి వస్తోంది. విద్యార్థుల ప్రాణాలతో ఆర్టీసీ చెలగాటమాడుతోంది. బస్సులో ఫుట్‌పాత్‌పైనే నిలబడి ప్రయాణిస్తున్న విద్యార్థుల ఫొటోను గురువారం ఉదయం 'ప్రజాశక్తి' 'క్లిక్' అనిపించింది. ప్రతిరోజూ ఇలాగే నిలబడే వెళ్లాల్సి వస్తుందని విద్యార్థులు వాపోయారు.

సత్యవేడు ఆర్టీసీ డిపో పరిధిలో పుత్తూరు వెళ్లేందుకు బస్సుల కొరత ఉంది. కాలేజీ టైంకు బస్సులు దొరక్కపోవడంతో విద్యార్థులు ప్రాణాపాయ స్థితిలోనే ప్రయాణం చేస్తున్నారు. ఇక విద్యార్థినుల పరిస్థితి అయితే చెప్పుకోలేని బాధ. అమ్మాయిలు, అబ్బాయిలు అనే తేడా లేకుండా బస్సుల్లో కూర్చేసే పరిస్థితి. దీంతో ఇసుకేస్తే రాలనంతగా బస్సులు కిటకిటలాడుతూ ఆ మార్గంలో వెళుతుంటాయి. పిచ్చాటూరు, నాగలాపురం, కెవిబిపురం, నింద్ర మండలాలకు చెందిన విద్యార్థులు ఉదయం 8 గంటలకు బస్సు ఎక్కితే గాని కాలేజీ టైంకు చేరుకోలేరు. వీరితో పాటు నిత్యం ఆఫీసులకు వెళ్లే ఉద్యోగులు, టీచర్లు,కాలేజీ విద్యార్థులతో ఆర్టీసీ బస్సులు భద్రత లేకుండానే ఫుట్‌పాత్‌లపైనే ప్రయాణించాల్సి వస్తోంది. కళాశాల విద్యార్థుల కోసం ప్రత్యేకించి అదనపు బస్సులు వేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు ఆర్టీసీ డిపో మేనేజర్‌ను కోరుతున్నారు.

అదనపు బస్సులు వేయాలి

శరవణ, పిచ్చాటూరు

మాది పిచ్చాటూరు మండలం రామగిరి గ్రామం. పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫస్టియర్ చదువుతున్నాను. రోజూ ఉదయం కాలేజీకి వెళ్లాలంటే బస్సు ప్రయాణం చాలా ఇబ్బందిగా ఉంటోంది. ఎనిమిది గంటలకు బస్సు ఎక్కితే గానీ కళాశాల సమయానికి చేరుకోలేం. వెళ్లేటప్పుడు, వచ్చేటప్పుడు నిలబడే ప్రయాణం. ఆర్టీసీలో సీటు అనేది మా విద్యార్థులకు అందని ద్రాక్షే.

అధికారులు స్పందించాలి : మునుస్వామి, కెవిబిపురం మండలం

కెవిబిపురం మండలం మిదికుంటయ్య గ్రామం. మా అబ్బాయి రోజూ పుత్తూరు కాలేజీకి వెళ్లి వస్తాడు. రోజూ ఉదయం పిచ్చాటూరు బస్టాండ్‌కు వెళ్లి అక్కడనుంచి కళాశాలకు వెళ్లాలి. ఉదయం 8 గంటలకు పంపుతున్నాం. బస్సు ప్రయాణంలో రోజూ ఇబ్బందే. కళాశాల విద్యార్థులకు ప్రత్యేకంగా బస్సు సౌకర్యం కల్పించాలి.

బస్సు సౌకర్యం కల్పించాలి : చిన్నబ్బ, నింద్ర

ప్రైవేట్ కాలేజీల్లో చదివే విద్యార్థులకు కళాశాల వారే బస్సు సౌకర్యం కల్పిస్తారు. ఎంచక్కా కూర్చుని కాలేజీకి వెళ్లి వస్తుంటారు. మాకు అంత స్తోమత లేదు. అందుకే ప్రభుత్వ కళాశాలల్లో మా పిల్లల్ని చదివిస్తున్నాం. మా పేదరికమే మా పిల్లల్ని ఇబ్బందులకు గురిచేస్తోంది. ఎలాగైనా పిల్లల్ని చదివించుకోవాలన్న ఆశతో చాలీచాలని బస్సు సౌకర్యం ఉన్నా అలాగే మా పిల్లలు వెళ్లి వస్తున్నారు. ప్రతిరోజూ 20-25 కిలోమీటర్ల దూరం నిలబడే ప్రయాణించాల్సి ఉంటుంది.

అదనపు బస్సులు కల్పిస్తాం : వెంకటరమణ, సత్యవేడు డిపో మేనేజర్

బస్సుల కొరత ఉన్న మాట వాస్తవమే. ప్రతిరోజూ సత్యవేడు డిపో నుంచి తిరుపతికి రోజూ 7-8.30 గంటల బధ్య బస్సు వెళుతోంది. అయినా కొరత ఉన్నందువల్ల బస్సు డ్రైవర్లతో సమావేశం ఏర్పాటు చేసి, ఏ సమయంలో విద్యార్థులు ఎక్కువమంది ఉంటారో తెలుసుకుని తప్పకుండా అదనపు బస్సులు కల్పిస్తాం.

వైకుంఠ ఏకాదశికి విస్తృత ఏర్పాట్లు

ప్రజాశక్తి - తిరుమల: తిరుమలలో జనవరి 10 నుండి 19వ తేదీ వరకు వైకుంఠ ద్వార దర్శనానికి విచ్చేసే భక్తుల సౌకర్యార్థం విస్తత ఏర్పాట్లు చేస్తున్నట్లు టీటీడీ అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి చెప్పారు. తిరుమలలోని పలు ప్రాంతాలను అదనపు ఈవో, జెఈవో వీరబ్రహ్మం, జిల్లా ఎస్పీ సుబ్బ రాయుడు, సివిఎస్వో శ్రీధర్‌తో కలిసి పరిశీలించారు.అనంతరం అదనపు ఈవో మీడియాతో మాట్లాడుతూ వైకుంఠ ద్వార దర్శనానికి విచ్చేసే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా టీటీడీ అధికారులు, విజిలెన్స్, పోలీస్ సిబ్బంది సమన్వయంతో దర్శనం కల్పించనున్నట్లు తెలిపారు. జనవరి 10, 11, 12వ తేదీలలో అధిక సంఖ్యలో భక్తులు వస్తారు కావున ఇందుకోసం అధికారులతో చర్చించి పూర్తి స్థాయిలో ప్రణాళికలు రూపొందించినట్లు చెప్పారు. దర్శనానికి విచ్చేసే విఐపిలకు వారికి అందించే పాసులలోనే దర్శన సమయం, పార్కింగ్ ప్రాంతం, ప్రవేశ, నిష్క్రమణ గేట్ల వివరాలు పొందిపరిచనున్నట్లు తెలిపారు. రాంబగిచా ప్రాంతంలో వాహన పార్కింగ్‌ను ఈ రోజులలో బైటకు బదిలాయించినట్లు చెప్పారు. దీనికి బదులుగా 10 బగ్గీలు, అదనపు సిబ్బంది, సైన్ బోర్డులు ఏర్పాటు చేస్తామన్నారు. విఐపిలు, భక్తులు తమకు కేటాయించిన సమయం ప్రకారం మాత్రమే దర్శనానికి రావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. భక్తులు తమ పాదరక్షలను గదులలో, వారి వాహనాలలో వదలి రావాలన్నారు. అధిక రద్దీ నేపథ్యంలో తోటి భక్తులకు ఇబ్బంది లేకుండా పారిశుద్యాని పాటించాలని, వ్యర్థాలను టీటీడీ ఏర్పాటు చేసిన డస్ట్ బిన్లలోనే వేయాలని కోరారు. భక్తులకు సూచించిన నిబంధనలు పాటిస్తూ టీటీడీకి సహకరించాలన్నారు. ఎస్పీ సుబ్బరాయుడు మాట్లాడుతూ తిరుమల, తిరుపతిలలో వైకుంఠ ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేపట్టాల్సిన భద్రతా ఏర్పాట్లను పరిశీలించినట్లు తెలిపారు. తిరుమలలో ట్రాఫిక్‌ను సక్రమంగా నిర్వహించడం, తిరుపతిలోని ఎస్ఎస్‌డి కౌంటర్ల వద్ద, ఫుట్‌పాత్ మార్గంలో కూడా బందోబస్తు ఏర్పాటు చేయడంపై సుదీర్ఘంగా చర్చించినట్లు వివరించారు. అంతకుముందు అదనపు ఈవో, జిల్లా ఎస్పీతో కలిసి పరకామణి భవనం పక్కన ఉన్న ఖాళీ ప్రాంతం, శ్రీవారి సేవాసదన్ ముందు, మాతశ్రీ తరిగొండ వెంగమాంబ బందావనం సమీపంలో ఉన్న పార్కింగ్ ప్రాంతాలను పరిశీలించారు. తరువాత ఏటిసి వద్ద క్యూలైన్లు, ప్రవేశ మార్గాలను పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. డెప్యూటీ ఈవో లోకనాథం, విజివో సురేంద్ర పాల్గొన్నారు.

వలంటీర్లను విధుల్లోకి తీసుకోవాలి : సిఐటియు

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: రాష్ట్రవ్యాప్తంగా జనవరి 3,4, తేదీలలో కలెక్టరేట్ల వద్ద వలంటీర్లు తమ సమస్యలపై ధర్నా నిర్వహించడం జరుగుతుందని సిఐటియు జిల్లా అధ్యక్షులు జిబిఎస్ మణ్యం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తాము అధికారంలోకి వస్తే గౌరవ వేతనం 5వేల నుండి 10వేలు చేస్తామని అనేక సందర్భాలలో ముఖ్యమంత్రి హామీ ఇచ్చారని, అయితే వారికి గౌరవ వేతనాన్ని నిలిపివేస్తూ విధుల్లోకి కూడా అనుమతించకపోవడం బాధాకరం అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రెండున్నర లక్షల మంది వాలంటీర్లు పనిచేస్తున్నారని, వీరు ఉపాధి లేక తమ కుటుంబ పోషణ భారమై వీధిన పడ్డారన్నారు. 3,4 తేదీలలో జరిగే ధర్నాలో అందరూ పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

నేడు శ్రీకాళహస్తిలో జిల్లాస్థాయి సైన్స్ వైజ్ఞానిక ప్రదర్శన

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించనున్న జిల్లా వైజ్ఞానిక ప్రదర్శన విజయవంతం చేసేందుకు అందరూ కృషి చేయాలని పుత్తూరు ప్రభాకర్ రాజు అన్నారు. పట్టణంలోని ఆర్పిబిఎస్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ఆయన ప్రధానోపాధ్యాయులు, పీడీలు, ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన వ్యక్తిగత గ్రూప్ ఉపాధ్యాయ విభాగాల కింద ప్రతి మండలం నుంచి 3 ఎగ్జిబిట్లు జిల్లా ప్రదర్శనలో ప్రదర్శించనున్నట్లు చెప్పారు. ముందుగా ఏర్పాటుచేసిన కమిటీలు వారి కేటాయించిన పనులను పూర్తి చేసేందుకు ముందస్తుగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. జిల్లా నలుమూలల నుంచి ప్రదర్శనలో పాల్గొనేందుకు వచ్చే విద్యార్థులు, ఉపాధ్యాయులకు అవసరమైన తాగునీరు, భోజనం సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు.కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి భాను ప్రసాద్, ఎంఈఓ లు భువనేశ్వరి, బాలయ్య, ప్రధానోపాధ్యాయులు రాజేశ్వరి, కష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు నారావారిపల్లిలో మెగా జాబ్‌మేళా

ప్రజాశక్తి - రామచంద్రాపురం (తిరుపతి రూరల్): చంద్రగిరి నియోజకవర్గంలో నిరుద్యోగ నిర్మూలనకు సీఎం చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నట్లు చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి వెంకట మణి ప్రసాద్ (నాని) స్పష్టం చేశారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ చంద్రగిరి నియోజకవర్గంలో ఉన్నత చదువులు చదువుకున్న యువతీ యువకులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించడమే తన లక్ష్యమని, ఎన్నికల సమయంలో నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీ నెరవేర్చడం కోసమే జనవరి 3న సీఎం స్వగ్రామం నారావారిపల్లెలో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. సీఎం స్వగ్రామం నారావారిపల్లెలో పెద్ద ఎత్తున మెగా జాబు మేళా నిర్వహించేందుకు సమాయత్తమైనట్లు పేర్కొన్నారు. 20 బహుళ జాతీయ కంపెనీల ప్రతినిధులు అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. అందులో భాగంగా సుమారు 1200 మందికి ఉద్యోగాలు కల్పించే దిశగా ఈ కార్యక్రమం జరగనుంది అన్నారు. రాష్ట్ర నైపుణ్యాభివద్ధి సంస్థ, ఎంప్లాయ్మెంట్ ఎక్స్ఛేంజ్, డిఆర్డిఏ, పంచాయతీరాజ్ శాఖల ఆధ్వర్యంలో నారావారిపల్లి లోని టిటిడి కళ్యాణ మండపంలో మేళా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఐదవ తరగతి మొదలుకొని బీటెక్, డిగ్రీ, పీజీ పూర్తి చేసిన యువతకు ఉద్యోగ అవకాశాలు ఉంటాయన్నారు. వివరాలకు 91609 12690, 91775 08279, 90305 27060 నంబర్లను సంప్రదించాలన్నారు.